08062024-MAI-06_Layout 1 6/8/2024 4:03 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

చెక్కు చెదరని ఫెడరలిజం

దేశంలో ఫెడరలిజం చెక్కు చెదరకపోవటం ప్రస్తుత లోక్‌సభ ఫలితాలు తేల్చిచెప్పిన ముఖ్యాంశాలలో ఒకటి. ఫెడరలిస్టు పార్టీల బలం రాష్ట్రాల వారీగా చూస్తే కొన్నిచోట్ల తగ్గవచ్చు. కాని దేశం మొత్తం మీద చూసినప్పుడు 2019 కన్న 2024లో మరింత పెరిగిందన్నది గమనించదగిన విశేషం. బీజేపీ, కాంగ్రెస్‌లు మాత్రమే జాతీయ పార్టీలు కాగా వాటి ఉమ్మడి బలం 2019లో 303+52= 355 నుంచి ఈసారి 240+99=339కి పడిపోయింది.

మొత్తం 543 మంది సభ్యుల సంఖ్య గల లోక్‌సభలో ఇతర పార్టీల బలం 188 నుంచి 204కు పెరిగింది. మొదటిసారి 1977లో జనతా పార్టీ పేరిట ఫెడరల్ శక్తుల కూటమి కేంద్రంలో అధికారానికి వచ్చినప్పటి నుంచి, తర్వాత 47 సంవత్సరాల పాటు మధ్య మధ్య చిన్నపాటి వ్యవధులతో ఫెడరల్ శక్తులు ప్రభుత్వాల ఏర్పాటుకు కీలకం అవుతూనే వస్తున్నాయి. ఇప్పుడు 2024లో కనిపిస్తున్నది కూడా అదే.

టంకశాల అశోక్

జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు ఏకచ్ఛత్రాధిపత్యం మినహా ఫెడరల్ శక్తులంటే ఎంతమాత్రం సరిపడే విషయం కాదు. బీజేపీ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ అయితే అసలు ప్రాంతీయ పార్టీలకు, భాషా ప్రయుక్త రాష్ట్రాలకు వ్యతిరేకంగా సిద్ధాంతీకరించింది కూడా. తమకు మెజారిటీ లభించనప్పుడు విధి లేక ఆ పార్టీలతో పొత్తు పెట్టుకోవటం, లేదా మెజారిటీ రాగల అవకాశం లేదని గ్రహించినప్పుడు ఎన్నికలకు ముందే అవగాహనకు రావటం అయితే చేస్తున్నారు గాని, ఆ తర్వాత ఫెడరల్ పార్టీలను చీల్చటానికి, తమలో కలుపుకోవటానికి, అణచివేయటానికి రకరకాల ప్రయత్నాలకు పాల్పడుతూ వస్తున్నారు. ఇందులో కాంగ్రెస్, బీజేపీ అనే రెండు సెంట్రలిస్టు, యూనిటరిస్టు, జాతీయపార్టీల మధ్య ఎటువంటి తేడా లేదు. ఇందుకు ఎన్నిన్ని ఉదాహరణలనైనా ఇవ్వవచ్చు.

ప్రాంతీయ శక్తులు, వాటికి ప్రాతినిధ్యం వహించే ఫెడరలిస్టు పార్టీలు ఈ ప్రయత్నాలన్నింటిని తట్టుకుంటూ 47 సంవత్సరాల తర్వాత ఈ 2024 ఎన్నికల నాటికి కూడా నిలిచి ఉండటం, తద్వారా దేశంలో ఫెడరలిస్టు ధోరణులను సజీవంగా ఉంచటం మన దేశ ప్రజాస్వామ్యంలో ఒక గమనార్హమైన స్థితి. ఈ ఎన్నికలలో ప్రధాని మోదీ నాయకత్వాన బీజేపీకి సొంత బలం 303 నుంచి 240కి పడిపోగా, మరొక 53 స్థానాలతో ప్రాంతీయ పార్టీలు అండగా నిలవకపోతే బీజేపీ మరొకసారి అధికారానికి రాగల అవకాశమే ఉండేది కాదు. అదేవిధంగా, ఇండియా కూటమికి 234 స్థానాలు రాగా, అందులో కాంగ్రెస్‌వి 99 మాత్రమే. తక్కిన 135 ఫెడరల్ శక్తులవి కావటం గుర్తించదగ్గది. ఇందులో మరొక విశేషం ఉన్నది. కాంగ్రెస్ బలం 2019 నాటి 52 కన్న దాదాపు రెట్టింపు అయిందని పలువురు ఆ పార్టీని, పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీని పొగుడుతున్నారు గాని, ఆ 99లో సుమారు 40 ఆయా రాష్ట్రాలలోని ఫెడరల్ పార్టీలతో పొత్తుల వల్ల గెలిచినవి మాత్రమే. అనగా ఒంటరిగా బలం పెంచుకున్నది దాదాపు శూన్యం. యూపీ, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు మొదలైన చోట్ల పొత్తులు లేనట్లయితే పరిస్థితి ఏ విధంగా ఉండేదో ఎవరైనా ఊహించవచ్చు. అదే పద్ధతిలో బీజేపీ అనే మరొక జాతీయ పార్టీకి కూడా ఇంతకాకున్నా ఒక మేరకు, ప్రాంతీయ పార్టీలతో ఒప్పందాల వల్లనే 240 స్థానాలు లభించాయి. రెండు జాతీయ పార్టీల బలాబలాలను విశ్లేషించినట్లయితే, అదేవిధంగా ఫెడరల్ పార్టీలు గెలుచుకున్న 204 సీట్లను (ఎన్డీయేలోని 53, ఇండియా కూటమిలోని 135, ఏ కూటమిలో లేని పార్టీలు, వ్యక్తులు కలిపి 16) చూసినట్లయితే పరిస్థితి ఏమిటో బోధపడుతుంది.

ఫలితాలలో మరికొన్ని విశేషాలను గమనించినప్పుడు, జాతీయ పార్టీలనబడేవాటి పరిమితులు ఏమిటో, ఫెడరల్ శక్తుల బలమేమిటో మరికొంత అర్థమవుతుంది. ముందుగా ఇండియా కూటమిని చూద్దాము. ఆ కూటమిని ఏర్పాటుచేసే క్రమంలో సమాజ్‌వాదీ, తృణమూల్, ఆప్, ఎన్సీపీ (పవార్) వంటి పార్టీలతో కాంగ్రెస్ సంబంధాలు సాఫీగా ఏమీ సాగలేదు. సమాజ్‌వాదీ దాదాపు దూరమైనంత పనికాగా, తృణమూల్ ఒంటరిగా పోటీ చేసింది. కాంగ్రెస్ ఆధిపత్య ధోరణిని ఆ విధంగా ధిక్కరించి కూడా అవి గొప్ప ఫలితాలు సాధించాయి. మరొక వైపు టీడీపీ, జనసేన కలిసిరానట్లయితే బీజేపీకి ఆంధ్రప్రదేశ్‌లో స్వయంగా గెలవడమంటూ గాని, ఆ రెండు పార్టీల 18 స్థానాలు తోడవటం గాని ఉండేవి కాదు. అప్పుడు ఎన్డీయే బలం కనీస మెజారిటీ అయిన 272 దగ్గర బొటాబొటిగా ఆగిపోయేది.

దీనంతటిలో పాఠమేమంటే, ఇండియా వంటి మహా వైవిధ్యత గల దేశంలో జాతీయతకు, ఫెడరలిజానికి మధ్య సమతులనమన్నది ఒక తప్పనిసరి అవసరం. జాతీయపార్టీల అవసరమే లేదనటం ఎంత పొరపాటు అవుతుందో ఫెడరల్ పార్టీలకు కాలం చెల్లిందని గాని, చెల్లుతుందని గాని భావించటం అంతే పొరపాటవుతుంది. జాతీయత ఒక జాతిగా ఈ దేశ అవసరం. ఫెడరలిజం ఒక వైవిధ్య వ్యవస్థగా మన సమాజ అవసరం. ఈ రెండింటిని కూడా మన స్వాతంత్ర్యోద్యమ నాయకులైన మహా మేధావులు, దార్శనికులు లోతుగా అధ్యయనం చేసినందువల్లనే, దేశ దీర్ఘకాలిక భవిష్యత్తును అన్ని కోణాల నుంచి దృష్టిలో ఉంచుకుంటూ రెండు కీలకమైన మాటలన్నారు. బలమైన కేంద్రం, బలమైన రాష్ట్రాలన్నది ఒకటి. వాటి మధ్య సహకార ఫెడరలిజమన్నది రెండు. రాజ్యాంగాన్ని, చట్టాలను, పంచ వర్ష ప్రణాళికలను, కేంద్ర ప్రణాళికా సంఘం, ఆర్థిక సంఘం, నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, అంతర్రాష్ట్ర కౌన్సిల్ వంటి వ్యవస్థలను అందుకు అనుగుణంగానే రూపొందించారు. ఆ విధంగా దేశాన్ని ప్రపంచానికే ఆదర్శవంతం చేయబూనారు.

తొలిదశ తర్వాత వచ్చిన పాలకులు, పార్టీలు అందుకనుగుణంగా వ్యవహరించి ఉంటే దేశం అద్భుతంగా రూపుదిద్దుకొని ఉండేది. కాని వారి స్వార్థాలు, వైఫల్యాల వల్ల ఒకవైపు ఈ లక్ష్యాలు దెబ్బతింటూ పోగా, దాని పర్యవసానంగా ప్రాంతీయ శక్తులు బలోపేతం కావటం, యూనిటరిస్టు శక్తులకు, వాటి వక్రీకృత జాతీయతకు ఆ ప్రాంతీయ శక్తులతో ఘర్షణ తలెత్తటం మొదలైంది. జాతీయత పేరిట అధికారాన్ని తమ చేతిలో కేంద్రీకృతం చేసుకోవటంలో, రాష్ట్రాల హక్కులను హరించటంలో, ధనిక వర్గాల కోసం అంతర్గత వలసలను, అసమానతలను ప్రోత్సహించటంలో మొదట కాంగ్రెస్, తర్వాత బీజేపీ ఒకదానికొకటి తీసిపోలేదు. ఆ క్రమంలో వారిద్దరు అన్ని రాజ్యాంగ వ్యవస్థలను సైతం బలహీనపరిచారు. అయినప్పటికీ, ఈ దేశ వైవిధ్యతలే, ప్రజల ఆకాంక్షలే తమ అంతర్నిహితమైన మౌలిక బలంగా గల ఫెడరల్ శక్తులు అన్ని ఒడిదుడుకులను తట్టుకుంటూ నిలబడుతున్నాయనటానికి ఈ 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, అందులో ప్రతిఫలిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌ల బలహీనతలు ఒక తిరుగులేని రుజువు.

ఇక్కడినుంచి బయలుదేరి భవిష్యత్తు విషయానికి వస్తే, తమకు, ఎదురులేదనే అహంకారాన్ని మోదీ, బీజేపీ, సంఘ్‌పరివార్‌లు వదులుకోవాలి. తమకు వచ్చిన 99 సీట్లు తమ ఘనత అనే మిడిసిపాటును రాహుల్, కాంగ్రెస్‌లు మానుకోవాలి. వరుసగా మూడుసార్లు అధికారం కోల్పోయిన 99 సీట్లలో చాలా భాగం ఇతర మిత్రపక్షాల చలవ అయినందున అహంకరించవలసిందేమీ లేదు. ఆ తర్వాత తమ వైఫల్యాలపై సీరియస్‌గా, నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ఇక ఫెడరలిజం విషయానికి వస్తే, ఈ దేశ వైవిధ్యతను, ఫెడరల్ శక్తుల పాత్రను, వాటిని ప్రతిబింబించే రాజ్యాంగాన్ని, పైన పేర్కొన్న వివిధ వ్యవస్థలను గుర్తించి, గౌరవించి, అందుకు బద్ధులై తీరాలి. ప్రాంతీయ పార్టీలన్నవి తమకు నచ్చినా, నచ్చకపోయినా ఒక శిలాశాసనం వంటి, వేదవాక్కు వంటి వాస్తవం. వాటిని అవసరమైనప్పుడు ఉపయోగించుకుంటాము, అవసరం తీరినాక కబళించ జూస్తామనే ధోరణిని శాశ్వతంగా వదిలివేసి, ఈ దేశాన్ని నడిపించటంలో అవి తమతో పాటు భాగస్వాములనే వైఖరిని తీసుకోవాలి.

ఈ ఎన్నికలలో ప్రధాని మోదీ నాయకత్వాన బీజేపీకి సొంత బలం 303 నుంచి 240కి పడిపోగా, మరొక 53 స్థానాలతో ప్రాంతీయ పార్టీలు అండగా నిలవకపోతే బీజేపీ మరొకసారి అధికారానికి రాగల అవకాశమే ఉండేది కాదు. అదేవిధంగా, ఇండియా కూటమికి 234 స్థానాలు రాగా, అందులో కాంగ్రెస్‌వి 99 మాత్రమే. తక్కిన 135 ఫెడరల్ శక్తులవి కావటం గుర్తించదగ్గది.

ఎటమటం

నేనే మంత్రి పదవి వద్దన్నా!

'మంత్రి పదవుల కోసం పైరవీలు చేయకండి. ఎవరైనా ఇప్పిస్తామని చెప్పినా నమ్మకండి'.. అని ఎన్డీయే పక్షాల భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ ఎంపీలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయినా ఎవరు ఊరుకుంటారు.. ఎవరి ప్రయత్నాలు వారు చేయడం షరామామూలే కదా. కానీ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాత్రం తనకు మంత్రి పదవి ఇస్తామన్నా వద్దంటానని సంచలన ప్రకటన చేశారు. మంత్రి పదవి వస్తే ప్రజలను కలవడం కష్టమవుతుందనే కారణంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. రాజకీయ నాయకుల్లో పదవి వద్దనేవారు ఈ రోజుల్లో ఎవరుంటారు. విశ్వేశ్వర్‌రెడ్డి అలా ఎందుకన్నారనే చర్చ జరుగుతోంది. తెలంగాణలో పోయినసారి నలుగురు ఎంపీలు గెలవగా ఒక మంత్రి పదవి దక్కింది. ఆ లెక్కన ఈ సారి 8 మంది గెలవడంతో రెండు మంత్రి పదవులు దక్కుతాయి. దీంతో తనకు ఎలాగూ మంత్రి పదవి రాదని తెలిసే విశ్వేశ్వర్‌రెడ్డి అలా ప్రకటించి ఉంటారని ఓ కమలనాథుడు అభిప్రాయపడ్డారు. మంత్రి పదవి వద్దనడం వెనుక అసలు మతలబు ఇదన్నమాట.



సర్వసత్తాక అమాత్యులు

ఏపీలో చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకారానికి వెళ్తారా? అని సీఎం రేవంత్‌రెడ్డిని మీడియా ప్రతినిధులు అడగగా.. ఇలాంటి విషయాల్లో సొంత నిర్ణయాలు ఉండవు, అదిష్ఠానం వెళ్లమంటే వెళ్తానని ఆయన స్పష్టం చేశారు. మరి ఖమ్మం టీడీపీ ఆఫీసులో జరిగిన విజయోత్సవానికి ముఖ్య అతిథిగా వెళ్లి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేక్ ఎలా కట్ చేశారని ఈ సందర్భంగా గాంధీభవన్‌లో చర్చ జరుగుతోంది. ఖమ్మం మంత్రులకు అధిష్ఠానం అంటూ ఏమీ లేదని, అక్కడ ఎవరికి వారే అధిష్ఠానమని చర్చించుకుంటున్నారు. మిగతా మంత్రులు ఒకెత్తు అయితే.. ఖమ్మం మంత్రులు మరొకెత్తు, వారివి ఇండిపెండెంట్ పోర్టుఫోలియోలని చమత్కరిస్తున్నారు.

మీ సంగతి చెప్పండి బాస్!

కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ముఖ్య నాయకులకు వ్యక్తిగతంగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు షాకిచ్చాయి. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ తన సిట్టింగ్ స్థానం బెంగళూరు రూరల్‌లో ఓడిపోగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్ ఎంపీ సీటుతో పాటు ఆయన సిట్టింగ్ సీటు మల్కాజ్‌గిరిలోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోలేకపోయారు. ఇప్పుడు అక్కడా, ఇక్కడా బీజేపీ నేతలు వీరిద్దరిని టార్గెట్ చేస్తూ ఇదే అంశాన్ని అస్త్రంగా మలుచుకోవడంతో కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదు.

సాకు దొరికిందోచ్!

ఏపీలో ఎవరూ ఊహించని ఫలితాలతో ఘోర పరాజయం పాలైన వైసీపీ నేతలకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. ఎంతో చేస్తే ఇలా ఎందుకైందన్నది తనకు అర్థం కావడం లేదని వైఎస్ జగన్ స్వయంగా వాపోయారు. కానీ, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి మాత్రం ఈవీఎంల ట్యాపరింగే తమ పార్టీ ఓటమికి కారణమని తేల్చేశారు. ఇక ఆ పార్టీ నేతలకు ఈవీఎంల సాకు దొరకడంతో తమను ఓడించింది ప్రజలు కాదు, ఈవీఎంలంటూ బృందగానం ఆలపిస్తున్నారు.

- వెల్జాల

పత్రికా స్వేచ్ఛకు బీజేపీ సంకెళ్లు

ఓ అత్యాచారం కేసు ఒక జర్నలిస్టు జీవితాన్ని తలకిందులు చేసేసింది. 28 నెలల పాటు ఆయనను జైలుపాలు చేసింది. అతని కెరీర్ సర్వనాశనమైంది. సర్వస్వాన్ని పోగొట్టుకున్న అతనెవరో కాదు, ప్రముఖ జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్. ఆయన నేరమో, ఘోరమో చేయలేదు. చేసిందల్లా.. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హత్రాస్ కేసు గురించి రిపోర్టింగ్ చేయడానికి ప్రయత్నించడమే. పదేండ్ల పాలనలో ఒక్క ప్రెస్‌మీట్ కూడా పెట్టని మోదీ హయాంలో జర్నలిస్టులు, ప్రెస్ ఫ్రీడమ్‌పై జరుగుతున్న దాడులకు ఓ మచ్చుతునక ఈ ఉదంతం. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో పత్రికా స్వేచ్ఛ మరింతగా క్షీణించవచ్చని విమర్శకులు ఆందోళన చెందుతున్నారు.

ఐశ్వర్య ఎస్.అయ్యర్

అది 2020. అక్టోబర్ నెల. మలయాళ న్యూస్ వెబ్‌సైట్‌లో కప్పన్ ఫ్రీలాన్సర్ జర్నలిస్టుగా పని చేస్తున్నారు. దళిత బాలికపై ఉన్నత వర్గాలకు చెందిన కొందరు సామూహిక లైంగికదాడికి పాల్పడినట్టు ఆరోపణలున్న హత్రాస్ కేసును రిపోర్టింగ్ చేసేందుకు ఆయన ఉత్తరప్రదేశ్‌కు వెళ్తున్నారు. కానీ, హత్రాస్‌కు చేరుకోకముందే కప్పన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాద నిరోధక, మనీలాండరింగ్ చట్టాల కింద అతనిపై అభియోగాలు మోపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కప్పన్ కుట్ర పన్నుతున్నట్టు పోలీసులు ఆరోపించారు. ఆయనకు బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు బీజేపీ నేతృత్వంలోని యూపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. మత విద్వేషాలను వ్యాప్తి చేయడమే లక్ష్యంగా ఆయన ఆర్టికల్ రాస్తున్నట్టు కోర్టులో వాదించింది. ఇదంతా మత వైషమ్యాలను రెచ్చగొట్టి, దేశంలో భయాందోళనలను వ్యాపించే కుట్రలో భాగమేనని కూడా చెప్పింది. తీవ్రమైన నేరారోపణలు చేయడంతో కప్పన్ 28 నెలల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. అయితే గతేడాది ఫిబ్రవరిలో అతనికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన ఇప్పుడు బయటే ఉన్నప్పటికీ.. కేసు ఇంకా నడుస్తుండటంతో కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తున్నది.

అయితే బెయిల్ వచ్చిన తర్వాత తన కుటుంబాన్ని పోషించుకునేందుకు సరైన ఉపాధి దొరక్క కప్పన్ తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మీడియా సంస్థల యాజమాన్యాల భయమే అందుకు కారణమని ఆయన చెప్పారు. ఎందుకంటే, ప్రభుత్వ ప్రకటనలపైనే మీడియా ఎక్కువగా ఆధారపడుతుంది. అందుకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాయడాన్ని, ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టడాన్ని ఎవరూ ఇష్టపడరు. కప్పన్ ఉదంతం చాలామంది ఇతర జర్నలిస్టులను భయాందోళనకు గురిచేసింది.

ప్రపంచంలోని అతిపెద్ద మీడియా మార్కెట్లలో భారత్ కూడా ఒకటి. పారిస్‌కు చెందిన రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఆర్ఎస్ఎఫ్) ప్రకారం.. మన దేశంలో 20 వేలకు పైగా దినపత్రికలు ఉన్నాయి. వివిధ భాషల్లో ప్రసారమయ్యే 450కి పైగా ప్రైవేట్ న్యూస్ చానళ్లున్నాయి. 2015 నుంచి 2023 మధ్యకాలంలో ప్రెస్ ఫ్రీడమ్ సూచీలో 25 స్థానాలు దిగజారిన భారత్ 161వ స్థానంలో నిలిచినట్టు ఆర్ఎస్ఎఫ్ తెలిపింది. ఈ సూచీలో పొరుగు దేశాలైన నేపాల్, పాకిస్థాన్, శ్రీలంకల కంటే భారత్ దిగువన ఉండటం శోచనీయం.

గత పదేండ్లుగా భారత్‌లో మీడియా స్థితి చాలా దిగజారిపోయిందని కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) ప్రతినిధి కునాల్ మజుందార్ తెలిపారు. నేరస్థులుగా చిత్రీకరించేందుకు గానూ జర్నలిస్టులను జైలుపాలు చేయడం, ఉగ్రవాద నిరోధక చట్టాల కింద అభియోగాలు మోపడం అందులో భాగంగానే జరుగుతున్నాయని ఆయన అన్నారు. సీపీజే ప్రకారం.. 2014-2023 మధ్యకాలంలో 21 మంది జర్నలిస్టులు జైలుపాలయ్యారు. 2004-2013 మధ్యకాలంలో ఈ సంఖ్య నాలుగు మాత్రమే. ఎలాంటి విచారణ లేకుండానే 180 రోజుల పాటు నిర్బంధించేందుకు అనుమతించే ఉగ్రవాద నిరోధక చట్టాలను జర్నలిస్టులపై ప్రయోగించడం ఈ పదేండ్లలో పెరగడం ఆందోళనకరం.

అదే ఉగ్రవాద నిరోధక చట్టాన్ని ఉపయోగించి పోలీసులు న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థను అదుపులోకి తీసుకున్నారు. 2020లో ఢిల్లీలో అల్లర్లను ప్రేరేపించినట్టు, కొవిడ్ గురించి దుష్ప్రచారం చేసినట్టు, ఉగ్రవాద సంస్థలకు నిధులను సమకూర్చినట్టు న్యూస్‌క్లిక్‌పై పోలీసులు అభియోగాలు మోపారు. ఈ ఆరోపణల కారణంగా గతేడాది అక్టోబర్ నుంచి జైలు జీవితం గడుపుతున్న పురకాయస్థ.. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఇటీవల విడుదలయ్యారు. అతని అరెస్టు, రిమాండ్.. చట్టం దృష్టిలో చెల్లవని ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పేర్కొనడం గమనార్హం.

ఇదిలా ఉంటే ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాలను విమర్శించేవారు వేధింపులకు గురవుతుండటం మరింత ఆందోళన కలిగించే అంశం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే, విమర్శించే జర్నలిస్టులను హిందూ జాతీయవాదులు బెదిరించేందుకు వెనుకాడటం లేదని ఆమ్నెస్టీ తెలిపింది. ప్రముఖ జర్నలిస్టు రవీశ్ కుమార్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఎన్డీటీవీలో రెండు దశాబ్దాలకు పైగా పనిచేసిన రవీశ్.. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండాలని చెప్పడంతో ఎన్డీటీవీకి రాజీనామా చేశారు. మోదీ-బీజేపీకి, అదానీకి మధ్య ఉన్న సామీప్యత కారణంగా ఇకపై తాను ప్రభుత్వాన్ని కఠినంగా ప్రశ్నించలేనని తెలిసి బయటకు వచ్చేసినట్టు రవీశ్ తెలిపారు.

మీడియాను ప్రభుత్వ అనుకూల వార్తలు ఆక్రమించేయడం ఆందోళనకరం. న్యూస్‌లాండ్రీ సంస్థ అధ్యయనం ప్రకారం.. ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 12 మధ్యకాలంలో 400కి పైగా సెగ్మెంట్‌లను అధ్యయనం చేయగా 52 శాతం ప్రసార సమయాన్ని ప్రతిపక్షాలను విమర్శించేందుకు కేటాయించినట్టు తేలింది. 27 శాతం ప్రసార సమయాన్ని మోదీ అనుకూల ప్రచారం కోసం కేటాయించినట్టు వెల్లడైంది.

పత్రికా స్వేచ్ఛపై దాడి అక్కడితోనే ఆగిపోలేదు. స్థానిక జర్నలిస్టులతో మొదలైన ఈ దాడుల పరంపర అంతర్జాతీయ మీడియా కరస్పాండెంట్ల వరకు కొనసాగింది. ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ దక్షిణాసియా బ్యూరో చీఫ్ అవనీ డియాస్‌కు వీసా నిరాకరించడంతో ఆమె భారతదేశాన్ని వీడాల్సి వచ్చింది. గతంలో ఫ్రెంచ్ జర్నలిస్టు వనెస్సా డూగ్నాక్ కూడా భారతదేశాన్ని వీడారు. ప్రధాని నరేంద్ర మోదీపై డాక్యుమెంటరీని విడుదల చేసిన కొన్ని రోజుల తర్వాత బీబీసీ కార్యాలయంపై ఐటీ అధికారులు దాడులు చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. తర్వాత సోషల్ మీడియాలో ఆ డాక్యుమెంటరీపై నిషేధం విధించారు. ఇలా అనేక విధాలుగా గత పదేండ్లుగా ప్రెస్ ఫ్రీడమ్ అణచివేతకు గురైంది.

(సీఎన్ఎన్ సౌజన్యంతో)

లౌకిక గీతం కావాలి

నెత్తురు మొలికిన నేల మీద
మెరుగులు దిద్దిడం కాదు
మాకిప్పుడు కీరవాణి లేని
సంగీతం కావాలి!

మమ్మల్ని మైమరిపించే
రికార్డ్ బ్రేక్ డాన్సులు వద్దు
ఐకమత్యాన్ని పెంపొందించే
లౌకిక గీతం కావాలి!

మీ వామన పాదాలు
వందలాది మందిని బలి తీసుకున్నవి
భాషను, యాసను, సంస్కృతిని
కాలరాసిన
మాయల మరాఠీల చేతిలో
నా రాష్ట్ర గీతం!

మా చావులకు కారణమైనోడే
అమరత్వాన్ని వెల కడుతుండు
దోపిడీ, వంచన జతకట్టి
త్యాగమే నాదంటున్నారు!

ఒకప్పుడు యుద్ధ గీతం
ఇప్పుడు రాష్ట్ర గీతం
పాటకు ప్రాణం పోసిన అందెశ
వేటగాడు గీతను బోధిస్తుండు!!

ఎదిరెపల్లి కాశన్న
96400 06304

ఆహ్వానం

ఆవిష్కరణ

రవీంద్ర భారతిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 8 శనివారం ఉదయం 10 గంటలకు ధిక్కార మహాత్మా పూలే స్ఫూర్తి కవిత్వం ఆవిష్కరణ జరుగనున్నది. నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు విమర్శకులు, చరిత్రకారులు డా.సంగిశెట్టి శ్రీనివాస్ సభాధ్యక్షులుగా, ఐఏఎస్ బుర్రా వెంకటేశం ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, జూలూరు గౌరీశంకర్, జి.లక్ష్మీ నరసయ్య, డాక్టర్ మామిడి హరికృష్ణ, బి.ప్రసాదమూర్తి, డాక్టర్ ఏ.జయంతి, డాక్టర్ పసునూరి రవీందర్ తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారు.

- వనపట్ల సుబ్బయ్య,
94927 65358

"స్పీకర్ పదవి కోసం పట్టుబట్టండి!

టీడీపీ, జేడీయూ పార్టీలకు వినయపూర్వకంగా నేను ఒక విషయాన్ని సూచిస్తున్నా. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో మీరే కీలకంగా ఉన్నారు. కాబట్టి, స్పీకర్ పదవి కావాలని గట్టిగా పట్టుబట్టండి. ఎందుకంటే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మరుక్షణం నుంచే ఇచ్చిన వాగ్దానాలను బీజేపీ ఉల్లంఘిస్తుంది. అంతేకాకుండా కూటమిలోని పార్టీలను కూడా విచ్ఛిన్నం చేస్తుంది. మీరూ గతంలో అనుభవించారు కదా. **- ఆదిత్య థాక్రే,** *శివసేన (యూబీటీ) నేత*